

# నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

సోమవారం 10 నవంబరు 2025 పేజీలు 8

## నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు భారీ స్పందన - ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి





**పాలమూరు సూర్య న్యూస్ :** మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ( ఎన్. ఎం .ఎం.ఎస్ ) నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు మంచి స్పందన లభించిందని ఎమ్మెల్యే యన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులలో చదువులో ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మహబూబ్నగర్ ఫస్ట్ కోఆర్డినేటర్ గుండా మనోహర్ మాట్లాడుతూ . ఆదివారం వివిధ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు ఈ మెరిట్ స్కాలర్ షిప్ స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొన్నారని తెలిపారు. స్థానిక మాడ్రన్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 400 మంది విద్యార్థులు, హన్వాడ మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్ష వ్రాశారని మహబూబ్ నగర్ ఫస్ట్ కోఆర్డినేటర్ గుండా మనోహర్ వెల్లడించారు. ఈ పరీక్షలో మెరిట్ సాధించిన 100 మంది విద్యార్థులకు జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి శ్రీ లలితాంబికా అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పది రోజులపాటు ఈనెల 12 నుంచి 22 వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను నిష్ణాతులైన అధ్యాపకులు ఆధ్వర్యంలో అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఫైనల్ పరీక్ష ఈ నెల 23 వ తేదీన జరగనుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి , హన్వాడ మండల ఎంఇఓ గోపాల్ నాయక్, తాటికొండ ప్రధానోపాధ్యాయులు బాలు యాదవ్, మాడ్రన్ స్కూల్ హెచ్ ఎం దత్తు రవి, హన్వాడ మండల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.



## పలు చౌక ధర దుకాణాలను తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్



**పాలమూరు సూర్య న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పలు చౌకధర దుకాణాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలో బండ్లగేరి, వీరన్నపేట్, టి. డి. గుట్ట ప్రాంతాలలో మహబూబ్ నగర్ పట్టణ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్ రెడ్డి తో కలిసి (ఎఫ్ పి షాప్) నెంబర్ 12, 19, 21, 34, 42 లను ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. షాప్ నెంబర్ 34 లో డీలర్ కాకుండా వేరే వ్యక్తి తో షాప్ నిర్వహించడం గమనించి షాప్ అసలు డీలర్ కు షోకాస్ నోటీసు ఇవ్వాలని మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ ను ఆయన ఆదేశించారు. అన్ని చౌక ధర దుకాణాలు సమయానుకులముగా ఉదయం సాయంత్రం తప్పనిసరిగా తెరిచి ఉంచాలని ఆదేశించారు.

## అనారోగ్య బాధితుడికి రూ.3 లక్షల సహాయం - మంత్రి వాకిటి శ్రీహరి




**ఊట్కూర్ సూర్య న్యూస్ :** ఊట్కూర్ మండల పరిధిలోని మొగ్ధంపూర్ గ్రామానికి చెందిన సత్తమ్మ భర్త వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ తక్షణ శస్త్రచికిత్స అవసరమైన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఈ విషయం మంత్రి వాకిటి శ్రీహరికి తెలియజేయగా, ఆయన వెంటనే చర్యలు తీసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 3 లక్షల ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా చూడడం జరిగింది. ఆర్థిక సహాయ పత్రాన్ని మంత్రి శ్రీహరి ఆదివారం తన అధికార నివాసంలో బాధితురాలు సత్తమ్మకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌కు మంచి వైద్యం అంది త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మీ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరినందుకు సంతోషిస్తున్నాను. రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. సత్తమ్మ కుటుంబం ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నాను అని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## ఉచిత కంటిపొర చికిత్స శిభిరానికి విశేష స్పందన



**లింగాల, సూర్య న్యూస్:** నల్లమల అటవీ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన లింగాల మండల కేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో అనూష ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి అండపల్లి జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుష ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ శంకర నేత్రాలయం చెన్నై సంయుక్తంగా నిరుపేదల కోసం ఈ 16 వరకు కొనసాగే ఉచిత కంటిపొర చికిత్స శిబిరానికి తొలి రోజు ఆదివారం ప్రజల నుండి విశేష స్పందన లభించింది. చుట్టూ ప్రక్కల గ్రామాలతోపాటు నల్లమల లోని లోతట్టు ప్రాంతంలోని వివిధ చెంచు పెంటల నుండి చెంచులు వైద్య శిబిరానికి విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న 101మందిని కంటి వైద్య నిపుణులు పరీక్షించి 10 మందిని కంటి శస్త్ర చికిత్స అవసరాన్ని గుర్తించి ధ్రువ పత్రాలను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఐ క్యాంప్ ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన అనూష ప్రాజెక్ట్ అధినేత జలంధర్ రెడ్డి మాతృభూమి రుణం తీర్చుకోవడానికి అచ్చంపేట నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా అంధత్వ నివారణే లక్ష్యంగా సామాజిక దృక్పథంతో శంకర నేత్రాలయం చెన్నై కంటి వైద్య నిపుణులచే ఉచిత కంటిపొర చికిత్స శిబిరాలను పలు ప్రాంతాలలో చేపట్టి నిరుపేదలకు శస్త్ర చికిత్సలు చేయించి ఎంతోమంది జీవితాలలో వెలుగు నింపాలని గుర్తు చేశారు. కంటి శుక్లాలతో బాధపడే వారికీ ఈ శిబిరంలోనే ఎంతో ఖరీదైన కంటి శస్త్ర చికిత్సలను చేయించడం జరుగుతుందన్నారు. గిరిజనులు లింగాల ప్రాంతంలో ఈ కంటి వైద్య నిర్వహించడం నిరుపేదలకు వరం వంటిదని అన్నారు. కంటి వైద్యాన్ని పేదలకు చేరువ చేయాలనే సంకల్పంతో మారుమూల ప్రాంతాలలో ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అరుదైన ఈ అవకాశాన్ని వినియోగించుకొని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే మా లక్ష్యం.... డాక్టర్ చైతన్య రెడ్డి



**కోయిలకొండ సూర్య న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే మా లక్ష్యం అని డాక్టర్ చేతన రెడ్డి తెలిపారు. ఆదివారంమండల కేంద్రమైన కోయిలకొండ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ఆర్ వి ఆర్ హాస్పిటల్ జనరల్ మెగా ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో మెగావైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు చేతన రెడ్డి, విజయ నందన రెడ్డి వచ్చిన రోగులకు వైద్యం అందించి చికిత్స నిమిత్తం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరి ప్రసాద్. నరేష్ .వెంకటేష్. లోకేష్ .రాజేష్. నాజూ ము. తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అవదూత స్వామి ఆరాధన ఉత్సవాలు



**నారాయణపేట, టౌన్ సూర్య న్యూస్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సద్గురు అవధూత నరసింహ స్వామి వారి 134వ సంజీవని సమాధి ఆరాధన మహోత్సవాలను ఆదివారం కమిటీ సభ్యులు అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాతం కాకడహారతి, రుద్రాభిషేకం, పాదపూజ, గోపాలకాల, మహాఅలంకరణ, సర్వదర్శనం, భజన సంకీర్తనలతో పల్లకిసేవా, నైవేద్యం, మహామంగళ హారతి, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మఠం కమిటీ సభ్యులు మహిళలు సేవాదళ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## దివ్యజ్ఞాన గ్రంథం భగవద్గీత

### బిఎస్పీ బాలు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఉచిత పంపిణీ



**నారాయణపేట టౌన్ సూర్య న్యూస్ :** భగవద్గీత పఠనం వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుందని మానవజన్మ పరిపూర్ణత సాధన కొరకు ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేసి వాటిలోని శ్లోకాలను ఆచరించి నడుచుకోవాలని సృష్టికి మూలంతో పాటు భగవద్గీత దివ్యజ్ఞానమని ఎస్పి బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహి పాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా భగవద్గీత గ్రంథలను పంపిణి చేయడం గర్వ కారణంఅని యోగి అచ్యుత ఆశ్రమ సాధకులు విద్య శ్రీ గోవర్ధన శారి పిలుపునిచ్చారు. అంతకుముందు సద్గురు అవధూత నరసింహస్వామి మఠం మాజీ అధ్యక్ష కార్యదర్శులు దేవదత్త ధగే తిప్పన్న కళ్యాణి లు భగవద్గీత గ్రంథాలకు పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాష ఉపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు యశ్వంత్ లాండ్గే, ప్రముఖ వ్యాపారస్తులు నాగురావ్ కమలాపూర్ బిజెపి నాయకులు కిరణ్ బిఆర్ఎస్ నాయకులు అభిరామ్ అర్చకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో జాజాపూర్ దేవాంగ్ సంఘం మహిళలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** పవిత్ర శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో నారాయణ పేట మండల పరిధిలోని జాజాపూర్ దేవాంగ్ సమాజ సభ్యులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ భక్తిని చాటుతున్నారు. మల్లన్న సన్నిధిలో గత మూడు రోజుల నుండి మహిళలు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై తరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వామివారి ఆలయంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు. జాజాపూర్ దేవాంగ్ సమాజ మహిళా సభ్యులు గత కొన్నేళ్ల నుండి శ్రీశైల మల్లికార్జున స్వామి సేవలో పాల్గొంటున్నారు.

## వాగు దాటడం కష్టం... వంతెన నిర్మించాలి



**మల్దకల్ సూర్య న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నుంచి ఎల్కూర్ కు వెళ్లే ప్రధాన రహదారిలో ఎద్దుల గూడెం, నీలిపల్లి మధ్యలో వాగు నీటితో నిండి, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీలి పల్లి, గార్లపాడు,ఎల్కూర్ గ్రామాలకు ఇది ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఈ మార్గంలో వంతెన నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలగుతాయని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# సమాజ సేవలలో అగ్రగామి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్.

### - వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్ బాబు.




**కల్వకుర్తి సూర్య న్యూస్ :** సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలందించడంలో అగ్రభాగాన నిలిచే సామాజిక సంస్థ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు అన్నారు. ఆదివారం వనస్థలిపురం వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన డిస్టిక్ వి 102 ఏ రీజియన్ 2 శ్రీశైల భ్రమరాంబిక సేవ పురస్కార వైభవం సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రీజియన్ పరిధిలోని వాసవి క్లబ్ల ద్వారా చేపట్టిన సామాజిక సేవలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో సేవలను అందించడం గొప్ప విషయం అన్నారు. సేవలతోనే సార్ధకత లభిస్తుందని రమేష్ బాబు చెప్పారు. సామాజిక సేవ బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని తోటి వారికి సహాయం అందించే గుణం తో మెలగాలని రమేష్ బాబు కోరారు. వాసవి క్లబ్ ఐ ఈ సి ఆఫీసర్ విఠ దురయ్య మాట్లాడుతూ సేవలకు వన్నె తెచ్చేది వాసవి క్లబ్ లు మాత్రమే అన్నారు.వి 108 ఎలెక్ట్ గవర్నర్ కల్మీచర్ల రమేష్, 102ఏ గవర్నర్ అల్లాడి పరమేశ్, అబ్సర్వర్ నవీన్, కొత్త మాసు రమేష్ , ఉప్పల శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మద్ది శివ నాగేశ్వరరావు, సరస్వతి రీజియన్ పరిధిలోని వాసవి క్ల బ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో రమేష్ బాబు ప్రత్యేక పూజ నిర్వహించారు. వాసవి క్లబ్ సభ్యులు ఉన్నారు.

# అన్ని పార్టీలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి అవసరం

### - బీసీ సమాజ్ "చాయ్ పే చర్చ" లో మోడల శ్రీనివాస్ సాగర్



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** బీసీ సమాజ్ మహబూబ్ నగర్ జిల్లా ఆధ్వర్యంలో క్రిస్టియన్ పల్లి లోని ఎం వి ఎస్ కళాశాల మైదానంలో ఆదివారం చాయ్ పే చర్చ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు అమలు కావాలంటే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాధ్యమవుతాయని అన్నారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో పెడితేనే తప్ప బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వాలని లేనిపక్షంలో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. వివిధ కుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ,బీసీ భావజాలాన్ని నియోజకవర్గాలకు మండలాలకు గ్రామస్థాయికి విస్తరించినప్పుడే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని మన ఓటు మనకే వేసుకుని బీసీలను అత్యధిక మందిని చట్టసభల్లోకి పంపేందుకు కంకణబద్ధులై పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, రిటైర్డ్ సబ్ రిజిస్టర్ వెంకటయ్య, రిటైర్డ్ జిహెచ్ఎం శ్రీనివాసులు,రిటైర్డ్ టీచర్ భగవంతు, రిటైర్డ్ ఎంఈఓ కురుమూర్తి,బి టీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల శంకర్, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎన్. విజయకుమార్, ఇంటలెక్చువల్ ఫోరం జుర్రు నారాయణ యాదవ్,కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, సగర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, జాంద్ర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మహేందర్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా యూత్ ప్రెసిడెంట్ పాలమూర్ వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి.శేఖర్, బీసీ సమాజ్ మహబూబ్నగర్ నియోజకవర్గ కన్వీనర్ దుర్గేష్, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు, టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ పట్టణ ఉపాధ్యక్షుడు టి .కృష్ణ, ఉమాపతి, బీరయ్య, మోహన్, వెంకటయ్య ,భాస్కర్,రాఘవేంద్ర, టీచర్ కృష్ణ, వెల్టూర్ నరేందర్, రఘు,సాయి శంకర్, జగన్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

# మినుము పంటపై గుర్తుతెలియని దుండగులు గడ్డి మందు పిచికరి.

### - నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించి రైతుకు న్యాయం చేయాలని మండల ప్రజల డిమాండ్.

### - రైతు లక్ష్మమ్మ ను ప్రభుత్వం ఆదుకోవాలి. గ్రామ రైతులు





**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్ :** మండల పరిధిలోని కొత్తపట్ల గ్రామ శివారులో రైతు ఆర్థికంగా నష్టపరిచే దుష్టచర్య చోటుచేసుకుంది. రైతు ఉప్పరి లక్ష్మమ్మ ఎంతో ప్రేమగా, చెమటోడ్చి సాగుచేసిన మినుము పంటపై గడ్డి మందు పిచికారి చేసి నాశనం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని రేపింది.వివరాల్లోకి వెళ్తే లక్ష్మమ్మ ఐదున్నర ఎకరాల భూమిలో పంటను సాగుచేస్తూ ఉన్నారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా పచ్చగా మెరిసే పంట ఒక్కసారిగా వాడిపోయి కనిపించింది. దగ్గరికి వెళ్లి చూడగానే గడ్డి మందు వాసనతో ఆమె షాక్కు గురయ్యారు.ఐదు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేశాను.ఎవరో కక్షతో నా రొట్టెను కాల్చేశారు అంటూ కన్నీళ్లతో విలపించారు లక్ష్మమ్మ. చుట్టుపక్కల రైతులు సంఘటన స్థలానికి చేరుకొని ఆమెకు ధైర్యం చెప్పారు.స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు వెంటనే కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని సందర్శించారు. పంటపై గడ్డి మందు పిచికారి చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.గ్రామస్థులు, రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ రైతు చెమట చిందిస్తేనే దేశం బతుకుతుంది. ఇలాంటి దుష్టచర్యలను సహించలేము. నష్టపోయిన లక్ష్మమ్మను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి అని కోరుతున్నారు.

# ప్రైవేట్ కళాశాలల పట్ల ముఖ్యమంత్రి వైఖరి సమర్ధనీయం

### - ఆల్ మే వా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుస్సేన్

**పాలమూరు సూర్య న్యూస్:** రాష్ట్రస్థాయిలో ప్రైవేటు రంగంలో నిర్వహిస్తున్నటువంటి ఇంజనీరింగ్ వివిధ కళాశాలల యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని భయాన్ని కలిగించే విధంగా ప్రవర్తించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ధైర్యంగా తిప్పి కొట్టి వారి యొక్క లోసుగులను బయట పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయము సమర్ధనీయమైనదని తెలంగాణ ఆల్ మే వా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారు హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలుఇష్టారాజ్యంగా డొనేషన్లు వసూలు చేస్తున్నాయని, కొన్ని సమస్యల వల్ల మధ్యలో కళాశాలలు మానివేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని తెలిపారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు దృవీకరణ పత్రాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఖాతరు చేయడం లేదని దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఒకే కళాశాల గుర్తింపు తెచ్చుకొని పలుచోట్ల బ్రాంచీలు నిర్వహించడం సరైనది కాదని తెలిపారు. ప్రైవేటు కళాశాలలో పాఠశాలల్లో పనిచేసే సిబ్బందికి మూడు నెలల వేతనాలకు గాను ఒకే నెల జీతాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఇది సహించరాని విషయమని పేర్కొన్నారు.ప్రైవేట్ పాఠశాలల యజమానులు పదవ తరగతి పరీక్ష ఫీజు 120 రూపాయలు ఉన్నప్పటికీ కూడా 2,500 నుంచి 5,000 వరకు వసూలు చేస్తున్నారని,ఒక్క రూపాయి విలువ ఉన్న బోనఫైడ్ కి వెయ్యి రూపాయలు వసూలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలలు పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట లేకుండా పోయిందని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విషయాలపై సమగ్ర న్యాయవిచరణ జరిపి సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని, ఆయన ప్రకటన ద్వార విజ్ఞప్తి చేశారు.

## రేషన్ కార్డుదారులకు బ్యాగుల పంపిణీ



**మాగనూర్ సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని రేషన్ షాపులో ఆదివారం లబ్ధిదారులకు ఉచితం బ్యాగుల పంపిణీ చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఈ నెల నుంచి ప్రతి ఒక రేషన్ కార్డుదారులకు ఉచితంగా బ్యాగుల పంపిణీ చేశారు. కాంగ్రెస్ తోనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమన్ని మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ అన్నారు. ఈ బ్యాగుల పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు.

## ప్రధాన రహదారిపై మద్యం షాప్ లను తొలగించాలి



**అమరచింత, సూర్య న్యూస్:** అమరచింత మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న మద్యం షాపులను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ పేర్కొన్నారు. ఆదివారం అమరచింతలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిపై మద్యం షాపు ఉండడం వల్ల ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా మద్యం దుకాణాలను ప్రధాన రహదారిపై పెట్టనివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో చంద్రబాబు, శ్రీకాంత్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వ కార్డుల పంపిణీ చేసిన టీడీపీ నాయకులు మోగులప్ప, రాములు యాదవ్



**దామరగిద్ద సూర్య న్యూస్ :** లింగారెడ్డి పల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో పార్లమెంట్ అడక్ కమిటీ మెంబర్ జి రాములు యాదవ్, మండల అధ్యక్షులు కే మొగులప్ప ఆధ్వర్యంలో 100 మంది కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకోవడం జరిగింది అందులో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు కర్రెమ్మ దేవాలయం దగ్గర సమావేశం జరిపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు సభ్యత్వం తీసుకున్న మెంబరు యాక్సిడెంట్ వల్ల చనిపోతే టి టిడిపి కార్యాలయం నుండి 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు అదేవిధంగా తన ఇంట్లో ఆడపిల్లల పెళ్లి జరిగితే వారికి 25 వేల పట్టు వస్త్రాలు అందజేయడం జరుగుతుంది అదేవిధంగా కుటుంబం అనారోగ్యం వల్ల లేకపోతే పై చదువులు చదివించుట కొరకు పార్టీ నుండి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుంది ఇట్టి కార్యక్రమంలో మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు గ్రామ అధ్యక్షులు ఎన్ అశోక్ రాములు ఏసురత్నం మాణికప్ప మాణిక్యమ్మ కాశమ్మ వెంకటమ్మ ఇందిరమ్మ గోవిందమ్మ లక్ష్మి రవికుమార్ దుర్గా హనుమంతు కుమ్మరి చెన్నమ్మ కుమ్మరి అరుణమ్మ దుర్గమ్మ దగ్గర దగ్గర 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్టిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక





**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం మహబూబ్ నగర్ లో జిల్లా కమిటీని కావలి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారిగా స్వామి, పరిశీలకులుగా రవీందర్ రెడ్డి ఈ ఎన్నికలు నిర్వహించగా టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా రమాకాంత్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డా. మొక్తాల మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన రామాకాంత్ మాట్లాడుతూ,పిఆర్సి, పెండింగ్ డీఏలు, మెడికల్ బిల్స్, ఇతరత్రా ఏరియర్స్ బిల్స్ సంబంధించి అన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి డా. మొక్తాల మురళీ మాట్లాడుతూ ఉపాధ్యాయ హెల్త్ కార్డ్స్ త్వరగా ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్ మినహాయింపు విషయంలో చొరవ తీసుకోని 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయించేలా కృషి చేయాలని కోరారు. 190 జీవోకు సంబంధించి శాశ్వత ప్రతిపాదికన స్థానికత ఆధారంగా అందరినీ అడ్జస్ట్ చేయాలని కాంగ్రెస్ మ్యానిపెస్టోలో పేర్కొన్న విధంగా మాట నిలుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమాకాంత్, డాక్టర్ మొక్తాల మురళీ, స్వామి, రవీందర్ రెడ్డి, రాములు, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక - ఎంపీడీవో తరుణ్



**తెలకపల్లి, సూర్య న్యూస్ :** తెలకపల్లి మండల కేంద్రంలో ఈజీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు సామాజిక తనిఖీ బృందం నివేదిక సమావేశం నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో తరుణ్ తెలిపారు, ఏడాది కాలంగా ఉపాధి హామీ పథకంలో రూ. 8.37 కోట్లు నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం రూపొందించిన నివేదికను ప్రజా వేదిక ద్వారా ప్రవేశ పెట్టనున్నారు అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని ఎంపీడీవో తరుణ్ కోరారు.

# కార్మిక వర్గ హక్కులకై ఉద్యమించండి

### - టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం






**చిన్న చింతకుంట సూర్య న్యూస్ :** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ)లి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం చిన్నచింతకుంట మండల పరిధిలోని పరీద్ పూర్ గ్రామంలో నిర్వహించడం జరిగింది ఈ క్లాసులకు టీయుసిఐ జిల్లా అధ్యక్షులు జేఎన్ దేవదానం అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్లి ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్ చందర్ ప్రసంగిస్తూ: దేశంలో రాష్ట్రంలోకి పైగా సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం తమ రక్త మాంసాలను ఒడిసి సంపదను సృష్టిస్తూ అర్ధాకలితో అలమటిస్తూ కనీసమైన హక్కులను. చాలా పోరాటాలు నిర్వహించడం జరిగింది. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచీలు పరుస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా విభజిస్తూ కార్మిక పొట్టలు కొడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం ముందుండి ఉద్యమించాలని ఆయన ఈ క్లాసుల సందర్భంగా పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు పని విధానం, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం, భారత కార్మిక ఉద్యమం అనే క్లాసును పి. అరుణ్ కుమార్ బోధించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోళ్ల వెంకటన్న, ఏ కొండన్న, వెంకట్రాములు, అరుణఅక్క, బాలు, వెంకటేష్ గౌడ్, అడివ అన్న, కోళ అంజన్న, నర్వ గోపాల్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర కోశాధికారి కే చంద్రన్న తోపాటు గ్రామపంచాయతీ కేజీబీవీ రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ గోదాం కార్మికులు ఆటో కార్మికులు భవన నిర్మాణ కార్మికులు కార్మికులు పాల్గొన్నారు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

---

# సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### - సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు




**తెలకపల్లి సూర్య న్యూస్ :** నవంబర్ 30 న జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలకపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సిఐటియు జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో నిర్ణయించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ గత మహాసభల నుంచి ఈ మహాసభల వరకు జరిగిన ఉద్యమాలు పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను పోరాటాలను రూపొందించుకోవడానికి మహాసభలు వేదికగా ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు కార్మికుల పనిగంటలు కనీస వేతనం ఉద్యోగ భద్రత ఈఎస్ఐ పి ఎఫ్ తదితర సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం అంత ఏకం కావాలని ఆయన సందర్భంగా పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు జిల్లా సహాయ కార్యదర్శులు పొదిల రామయ్య శంకర్ నాయక్ శివ వర్మ ఫసుయుద్దీన్ దశరథం శివరాములు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

# బీసీ ల చైతన్య సదస్సు విజయవంతం

### బీసీ, బహుజన ఉద్యమ నాయకులు, సంఘాలు



**గద్వాల ప్రతినిధి సూర్య న్యూస్:** బీసీ లకు 42% రిజర్వేషన్ ను సాధించడానికి గద్వాల నుండే ఉద్యమ ప్రారంభం అయిందని రాష్ట్రం నుండి వచ్చిన వక్తలు పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్ సాధనకై రాష్ట్ర బీసీ జేఏసీ, బహుజన ఉద్యమాలతో కలిసి పని చేస్తామని తీర్మానించారు. ఈ సదస్సులో జిల్లా వ్యాప్తంగా బీసీ లు, బహుజన ఉద్యమ పార్టీలు, సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కేంద్ర, రాష్ట్ర అధికార పార్టీల మీద తీవ్రమైన ఒత్తిడి తీసుకొని రావాలని ప్రతినబునారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బహుజన విద్యావేత్త అక్కల బాబు గౌడ్, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య కార్య నిర్వాహకులు మరియు బహుజన ఉద్యమ నాయకులు బిఆర్ఎస్ నాగర్ దొడ్డి వెంకట్రాములు,జేఏసీ మధుసూదన్ బాబు,అవాజ్ కమిటీ అతికూర్ రహిమాన్,బహుజన రాజ్య సమితి వాల్మీకి, వినోద్ కుమార్, బి ఆర్ ఎస్ వి కుర్వ పల్లయ్య, శంకర ప్రభాకర్, కృష్ణయ్య, రహిమతుల్లా,అచ్చన్న గౌడ్, నాగన్న, కిరణ్,చాకలి ఆంజనేయులు, ఐజ వీరేష్, తదితరులు తమ కార్యాచరణను వివరించారు. జేఏసీ నాయకుడు మధుసూదన్ బాబు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో వక్తలు ఆధిపత్య అధికార, ప్రతిపక్ష పార్టీల అగ్రవర్ణ నాయకుల కుట్రలను, తప్పులను ఎత్తి చూపారు. రాజ్యాంగంలో 10% ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ లను అమలు చేసిన నాయకులు బీసీ రిజర్వేషన్ లను ఎందుకు అడ్డుకొంటున్నారని ప్రశ్నించారు.ఇలాంటి రిజర్వేషన్ ల ప్రస్తావన రాజ్యాంగంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. అగ్రవర్ణ పేదలను ఆర్థికంగా ఆదుకోలేని అగ్రవర్ణ ఆధిపత్య పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడి పాలకులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ లతో ఎప్పుడో 50% లిమిట్ కూడా దాటిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర అగ్రవర్ణ పాలకులు తాము హామీ ఇచ్చిన 42% రిజర్వేషన్ లను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్ లో చేర్చి, రాష్ట్రపతి ఆమోదంతో గ్యారంటీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే అగ్రవర్ణ పాలకులను ఓటు ఆయుధము ద్వారా రాజకీయ భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.ప్రపంచంలో 60% బీసీ లు అంటే 140 కోట్ల జనాభాలో దాదాపు 84 కోట్ల మందిని మోసం చేసే ఆధిపత్య పార్టీలు మన దేశంలోనే కొనసాగడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు.ఎన్నో వేల సంవత్సరాలుగా ఆధిపత్య కులాల అణచివేతకు, సామాజిక అన్యాయానికి గురి అయిన బీసీ లు (శూద్ర కులాలు) రాజ్యాంగ ప్రకారం సమానత్వం ను సాధించడానికి అంబేద్కర్ లాంటి బహుజన మేధావులు, రాజ్యాంగ ప్రధాతలు రిజర్వేషన్ లను అమలు చేస్తే దాన్ని కూడా ఇష్టం వచ్చినట్లుగా అడ్డుకోవడం సిగ్గుచేటు అని నిందించారు.జనాభా మేరకు రిజర్వేషన్ లను, అవకాశాలను కల్పించకపోతే అగ్రవర్ణ పాలకుల ఇళ్లను ముట్టడించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.1931 సంవత్సరం లో బీసీ ల కుల గణన ను మళ్ళీ ఇప్పటిదాకా చేపట్టకపోగా,బీపీ మండల్ కమీషన్ సిఫార్సులను కూడా తుంగలో త్రొక్కారు.కనుక దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి, అన్ని పార్టీలు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే 42% బీసీ రిజర్వేషన్ లను అమలు చేయడానికి చర్యలు చేపట్టాలి.లేదంటే మా ఉద్యమాలు తప్పవు. ఈ కార్యక్రమం లో సిపిఐ ఆంజనేయులు, సిపిఎం ఉప్పేరు నర్సింహ, బీఎస్పీ రాంబాబు, భీమ్ ఆర్మీ బుడకల ప్రకాష్, మేడికొండ ఈశ్వర్, బుచ్చన్న, కృష్ణారెడ్డి, గోపాల్ యాదవ్,కోళ్ల హుస్సేన్, కృష్ణ, వీరేష్, స్వామిదాసు, గంజిపేట రాజు,ఆటో మక్ బూల్, దానయ్య, నాగిరెడ్డి, తాహేర్, రంగు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## సూగూరు విద్యార్థి ప్రతిష్టాత్మక క్రీడాలకు ఎంపిక



**పెబ్బేరు సూర్య న్యూస్ :** తెలంగాణ హనుమకొండ జిల్లాలో ప్రతిష్టాత్మక క్రీడ పాఠశాలలో అడ్మిషన్ కోసం ఎంపికైన పెబ్బేరు మండల కేంద్రంలో సుగూరు గ్రామానికి చెందిన జి. చతుర్వేదు తండ్రి జి.బాలరాజు కు వనపర్తి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూగూరు శివ. ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి. విద్యార్థి ప్రతిభను గుర్తించి సహకరించడం జరిగింది.ఈ సందర్భంగా. స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి కి. విద్యార్థి తల్లిదండ్రులు,గ్రామస్థులు, యువకులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రెస్లింగ్ ఛాంపియన్షిప్ లో బంగారు బహుమతులు సాధించిన ధన్వాడ మండల క్రీడాకారులు





**ధన్వాడ సూర్య న్యూస్ :** హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ అసోసియేషన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నారాయణపేట జిల్లా తరఫున పాల్గొన్న క్రీడాకారిణులు బంగారు పతకాలు గెలిచారు: కె. గీత 50 కేజీ విభాగం లో గోల్డ్ మెడల్ నాగలక్ష్మి 57 కేజీ విభాగం లో గోల్డ్ మెడల్ సాధించారు. వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి (నేషనల్ లెవెల్) పోటీలలో వీరు రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించనున్నారు. నారాయణపేట జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ యు. రవికుమార్, జిల్లా వెంకటేష్ శెట్టి,కేజీబీవీ ధన్వాడా ఎస్ ఓ గంగమ్మ,మరియు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి రామకృష్ణ రెడ్డి సాయినాథ్ పిడి ఆనంతసేన పిడి నెల్సన్ కుమార్ పిడి కేజీబీవీ ధన్వాడ పిటి సౌమ్య బల్సింగ్ నాయక్ డీఈవో సిబ్బంది రెస్టులింగ్ క్రీడా కారులకు అభినందించారు.

## రెండు నాలుకల ధోరణి వైఖరి విడాలి



మాగనూర్ సూర్య న్యూస్ : రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి వైఖరి విడాలని బిజెపి ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ విమర్శించారు. ఆదివారం పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం ఉచిత ప్రజా పంపిణీ కార్యక్రమం ఓ బూటకం అన్నారు. నరేంద్ర మోదీ సర్కార్ కరోనా కష్టకాలం నుంచి సుమారు 11 సంవత్సరాల పాటు ఒక్క మనిషికి ఐదు కేజీల చోప్పున ప్రజలందరికీ సన్నబియ్యం సరఫరా చేస్తున్న, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అదనపు ఒక్క కేజీ యాడ్ భరిస్తుందని, దీనికి తోడు ప్రస్తుతం ఉచిత బ్యాగుల పంపిణీలో నరేంద్ర మోడీ ఫోటో బదులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరా గాంధీ ఫోటో పెట్టడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఈ దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు కచ్చితంగా మూడు పూటలా అన్నం అందించాలనే సంకల్పంతో ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్న ఘనత మోదీ సర్కార్ దన్నారు.

## హెచ్ ఏ సి ఏ సెంటర్ ప్రారంభం



**మాగనూర్ సూర్య న్యూస్ :** మండల పరిధిలోని నేరేడుగం గ్రామంలో మల్లెపల్లి తిమ్మన్న కుమారుడు మల్లెపల్లి రవి నూతన హెచ్ ఏ సి ఏ సెంటర్ ను ఆదివారం శ్రీ పంచమ సిద్దలింగమహా స్వామి చేతుల మీదుగా సెంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గవినోల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకలకు హాజరైన నాయకులు



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** కల్వకుర్తి మున్సిపాలిటీ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గ్యార్మీ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర విద్య కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్ , జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శానవాజ్ ఖాన్, ఎజాస్, మసూద్, సోఫీ, ఆరిఫ్, ముక్తాధర్, ఖయ్యూం, హిమాయత్, అవేజ్, జిలాని, సాలం, తదితరులు ఉన్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజా, పల్లకి సేవా కార్యక్రమం

### - పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డి కే భరతసింహారెడ్డి

**గద్వాల్ సూర్య న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీ నందు పోతుల శ్రీనివాసరెడ్డి స్వగృహంలో అయ్యప్ప స్వామి పడిపూజా మరియు పల్లకి సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు భజనలు, భక్తి పాటలు, మాల ధరించిన భక్తుల ద్వారా ప్రత్యేక పూజలు చేసి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల వేసిన స్వాములందరూ ప్రతిరోజూ కఠినమైన దీక్షను చేస్తూ మణికంఠుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. అంతేకాకుండా 41 రోజుల పాటు కఠినమైన నియమ నిష్ఠలు, భక్తి శ్రద్ధలతో అయ్యప్ప దీక్షను కొనసాగిస్తారు. అయ్యప్ప మహా పడి పూజ అనేది శబరిమల ఆలయంలోని 18 మెట్లను గౌరవించే అత్యంత పవిత్రమైన పూజ. ఈ పూజలో 18 మెట్లు సత్యం, జ్ఞానం, భక్తి వంటి ఆధ్యాత్మిక సూత్రాలను సూచిస్తాయి. వాటిని అధిరోహించడం అనేది భక్తుని ఆధ్యాత్మిక పురోగతికి ప్రతీకగా భావిస్తారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు ఈ పూజను నిర్వహిస్తారు, ఇది వారి యాత్ర చివరి ఘట్టాన్ని సూచిస్తుందని భక్తులకు తెలియజేసారు. ఈ పూజ కార్యక్రమంలో డి కే భరతసింహారెడ్డి, మీర్జాపురం రామచంద్రారెడ్డి, బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, తూముకుంట తిరుమల్ రెడ్డి, జకిలేటి శ్రీకాంత్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గురుస్వాములు అయ్యప్పస్వాములు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పట్టణవాసులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పాలమూరు ఆణిముత్యం రష్మీక...

- రిటైర్డ్ ఆర్మీ కూతురు అద్భుత ఆటతీరు.
- తెలంగాణ హ్యాండ్ బాల్ జట్టులో స్థానం.
- టోర్నమెంట్ మొత్తంలో తన ఆట తీరుతో ఆకట్టుకుంది..



**కోస్గి సూర్య న్యూస్:** తండ్రి ఆర్మీలో ఉండి దేశానికి సేవ చేస్తే కూతరు తన అద్భుతమైన ఆట తీరుతో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ జట్టులో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.కోస్గి పట్టణంలో జరిగిన 69వ రాష్ట్ర అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీలలో మహబూబ్ నగర్ జట్టులో స్థానం సాదించి అత్యుత్తమ ఆటతీరు కనబర్చింది. మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ మండల బూరుగుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ శ్రీనివాస్ రెడ్డి కూతురు రష్మీక తన అద్భుతమైన ఆట తీరుతో పలువురిని ఆకట్టుకుంది.69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మహబూబ్ నగర్ జిల్లా బాలికల హ్యాండ్ బాల్ జట్టు లీగ్ దశలో జరిగిన పోటీలలో నాలుగు జట్లపై గెలవడంలో ముఖ్య భూమిక పోషించింది.జిల్లా కేంద్రంలోని రిషి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రష్మీక గత మూడేళ్ళుగా హ్యాండ్ బాల్ జట్టులో కీలక క్రీడాకారిణిగా కొనసాగుతుంది. తన అద్భుత ఆటతీరుతో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ జట్టులో స్థానం సాధించడం పట్ల పలువురు ఆమెను అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలపాలని కృషి చేశామని,త్వరలో గుజరాత్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రానికి కప్ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ విజేతలు వరంగల్, ఆదిలాబాద్ జట్లు..

- రెండవ స్థానంలో మహబూబ్ నగర్.
- మూడవ స్థానంలో కరీంనగర్ జట్లు..





**కోస్గి సూర్య న్యూస్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ ఫైనల్ లో బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు మహబూబ్ నగర్ జట్టుపై 16-7తేడాతో గెలుపొంది మొదటి బహుమతి సాధించింది.బాలుర విభాగంలో వరంగల్ మహబూబ్ నగర్ తలపడగా వరంగల్ జట్టు 22-15 తేడాతో మహబూబ్ నగర్ జట్టుపై గెలుపొంది మొదటి బహుమతి సాధించింది.మూడవ బహుమతికి జరిగిన పోటీలో కరీంనగర్ బాలుర,బాలిక జట్లు గెలుపొంది మూడవ స్థానములో నిలిచింది.మూడు రోజులపాటు జరిగిన పోటీలలో తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొనగా ఫైనల్లో మహబూబ్ నగర్ బాలికల,బాలుర జట్లు వరంగల్ తో బాలుర జట్టు,ఆదిలాబాద్ తో బలికల జట్టు పోటీ



పడ్డాయి.విజేతలుగా ఆదిలాబాద్,వరంగల్ జట్లు తుది.పోరులో విజేతలుగా నిలిచాయి.విజేతలుగా నిలిచిన జట్లకు స్థానిక నాయకులు బెజ్జు రాములు,తుడుం శ్రీనివాస్,బాలేష్, మాస్టర్ శ్రీనివాస్ బహుమతులను అందించారు. ఈసందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గేమ్స్ నిర్వాహకులు నర్సింహ,బాల్ రాజ్,హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి అసిఫ్, సాయినాథ్, రవికుమార్, అనంతసేన, రామకృష్ణ రెడ్డి,శంకర్ నాయక్,జియా, శ్రీనివాస్,ఉస్మాన్ ఆయా జిల్లాల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్ లు పాల్గొన్నారు.

# మలుపులు ముప్పు పిచ్చిమొక్కలతో దారి ఆవరణ ప్రమాదాలపై ఆందోళన







**ఊట్కూర్ సూర్య న్యూస్ :** ఊట్కూర్ మండల పరిధిలోని పులిమామిడి - బిజ్వార్ - అవుసలోనిపల్లి రహదారిలోని మలుపులు ప్రమాద పూరితంగా మారాయని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి ఇరువైపులా పిచ్చిమొక్కలు విస్తరించి, బీటీ రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుంతలను తప్పించేందుకు బైకులు, ఆటోలు కుడివైపుగా మళ్లించాల్సి వస్తోందని, ఆ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సింగిల్ రోడ్డు కావడంతో మలుపుల వద్ద ప్రయాణం ప్రాణాంతకమైందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాల పై అవగాహన: మద్దూరు ఎస్సై విజయ్ కుమార్



**మద్దూరు సూర్య న్యూస్ :** మద్దూరు టౌన్ లో ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారము ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, వాహన పత్రాలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రత మనందరి బాధ్యత అని ఆటో డ్రైవర్లు ఎల్లప్పుడూ జాగ్రత్తగా వాహనాలు నడపాలనీ చిన్న పాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది అని తెలిపారు అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను, కూలీలను ఎక్కించికోరాదని అలాగే ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన, చట్ట ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆర్టీఐ కేసులో విచారణఇన్ఫర్మేషన్ కమిషన్ నోటీసు జారీ



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** అనారోగ్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని కోరిన ఆర్టీఐ దరఖాస్తుపై తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ విచారణకు నోటీసులు జారీ చేసింది. ఊట్కూర్ మండల పరిధిలోని మొగ్ధంపూర్ గ్రామానికి చెందిన కె. నర్సింహులు 2024 నవంబర్‌లో సమర్పించిన సమాచార హక్కు దరఖాస్తుకు సరైన సమాధానం అందకపోవడంతో కమిషన్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కమిషన్ 2025 నవంబర్ 14న మధ్యాహ్నం 1 గంటకు నారాయణపేట్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు తెలిపింది. విచారణకు ఊట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజా సమాచార అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ) హాజరుకావాలని ఆదేశించింది. దరఖాస్తుదారు సమర్పించిన 6(1) ఆర్టీఐ దరఖాస్తు, 19(1) అప్పీల్, అందజేసిన సమాచార వివరాలు, రసీదులు, అఫిడవిట్‌లను ప్రతివాదులు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది. అలాగే దరఖాస్తుదారుడు కూడా తాను పొందిన లేదా పొందని సమాచారానికి సంబంధించిన ఆధారాలతో విచారణకు హాజరుకావాలని సూచించింది.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మెన్ : సదా శివారెడ్డి



**దామరగిద్ద సూర్య న్యూస్ :** రైతులు వరి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి లబ్ధిపొందాలని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆర్ సదా శివారెడ్డి,మరియు మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివ కుమార్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని కాన్ కుర్తి ,పీడెంపల్లి,మల్ రెడ్డి పల్లి గ్రామాలలో వారు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని ప్రభుత్వం నిర్వహించిన కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులు వారి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ 2389/- సాధారణ రకం 2369/- సన్న రకం వడ్లకు క్వింటలకు 500/- రూపాయలు బోనస్ ఉన్నందున రైతులు అందరూ సంఘాలకే విక్రయించాలని తెలిపారు.రైతులు బయట మార్కెట్ లో అమ్మి దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే గిట్టుబాటు ధర వస్తుందని,బోనస్ సైతం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ అధ్యక్షుడు ఈదప్ప ,మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు... మక్తల్ యస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి...



**మక్తల్ సూర్య న్యూస్ :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపియస్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు.ఆదివారం మక్తల్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు మనోహర్, శ్రీహరి లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది.అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భక్తులతో పోటెత్తిన శ్రీ కురుమూర్తి స్వామి జాతర

**- గోవింద నామ స్మరణతో మారుమోగిన కురుమూర్తి కొండలు**

**- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**







**చిన్న చింతకుంట, సూర్య న్యూస్ :** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరుని ప్రతిరూపముగా భక్తులు భావించే శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి ఆదివారం సెలవు ను పురస్కరించుకొని పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలు నుంచి ఉద్యోగులు విద్యార్థులు భక్తులు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయానికి తరలిరావడంతో కురుమూర్తి స్వామి కొండలు గోవింద నామస్మరణతో పులకించాయి ఉదయం నుంచే పల్లె ప్రాంతాల నుంచి ఎద్దుల బండ్లు ట్రాక్టర్లు ఆటోలు ద్విచక్ర వాహనాల్లో అధిక సంఖ్యలో తరలిరావడంతో జాతర మైదానం భక్తులతో కిక్కిరిసిపోయింది శ్రీ కురుమూర్తి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లో నిలబడి దర్శించుకున్నారు కొండ దిగువ ఉన్న స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు కొత్త మట్టి కుండలో పచ్చిపులుసు పరమాన్నము నైవేద్యమును సమర్పించి తమ తమ ముక్కులను చెల్లించుకున్నారు భక్తులు దీవించవయ్యా శ్రీ కురుమూర్తి రాయ అంటూ స్వామిని వేడుకుంటూ దర్శించుకున్నారు స్వామివారి ప్రధానాలయం ఉద్దాల మండపము లక్ష్మీదేవి ఆలయం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడే జాతర మైదానంలోని రహదారుల్లో ఏర్పాటు చేసిన దుకాణాలలో మహిళలు వంటింటి సామాగ్రి ఫ్యాన్స్ వస్తువులు గాజులు, మిఠాయి దుకాణాలలో కొనుగోలు జోరుగా కొనసాగుతున్నాయి జాతరలో పలు దుకాణాలు బజార్లు మహిళలు యువకులు యువతులు చిన్నారులతో రద్దీగా మారింది రంగుల రత్నాల వద్ద యువకులు మహిళలు చిన్నారుల సందడి నెలకొన్నది ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను శ్రీ కురుమూర్తి మూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి ఈవో మదనేశ్వర్ రెడ్డి పాలక్క వర్గం సభ్యులు ఆలయ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు



**శ్రీ కురుమూర్తి స్వామికి ఈనెల 17న ఆభరణాల తొలగింపు :** శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి స్వామివారి అలంకారము ఈనెల 10న సోమవారం తొలగించాల్సి ఉండగా ఈ సంవత్సరం వర్షం ప్రభావము వలన వ్యాపారాలు సరిగా నడవలేనందువలన భక్తులు వ్యాపారస్తుల కోరిక మేరకు శ్రీ కురుమూర్తి స్వామి వారి అలంకారం ఈనెల 17 సోమవారం వరకు పొడిగించి అదే రోజు ఉదయం 10 గంటలకు స్వామివారికి అలంకరించిన బంగారు ఆభరణాలను తీయబడునని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



# సైన్సు- మూఢ విశ్వాసాలపై సదస్సు విజయవంతం







**పాలమూరు సూర్య న్యూస్:** నాస్తిక సమాజం,బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన అయ్యన్న గారి యాదిలో సైన్సు- మూఢవిశ్వాసాలు అంశంపై ఆదివారం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించిన సదస్సు విజయవంతం అయింది.నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షులు చింతకింది జనార్దన్ అధ్యక్షత వహించగా, బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పట్నం చెన్నయ్య పాల్గొని మాట్లాడారు. అయ్యన్నతో సన్నిత్యాన్ని, మూఢవిశ్వాసాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, చైతన్య పోరాటాలను గుర్తు చేశారు. అయ్యన్న సేవలను కొనియాడారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య మతము- చరిత్ర అనే అంశం పై ప్రతిఘటన అంశాలను స్థూలంగా వివరించారు. అందులో భాగంగా వేదాల కాలం నుండి ఆయా మతంలో ఉన్న లోపాలను, అమానవీయ అంశాలను పోరాట ఘట్టాలను వివరించారు. సనాతన ధర్మం ఆర్ఎస్ఎస్ ప్రజలను విడదీస్తుందని,మెజారిటీ మతోన్మాదాన్ని ఎక్కిస్తూ పాసిజాన్ని సమాజంపై రుద్దుటుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుదిజీవులు మేధావులు దీన్ని గమనించి సమాజ హితం కొరకు ముందుకు రావాలని కోరారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ జయ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందింప చేయాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దానగల రవికుమార్, కార్యదర్శి విజయ్ కుమార్ నాసిక సమాజం యువ నాయకుడు చింత కింది బాలరాజు, మహబూబ్నగర్ కార్యదర్శి ఆడిటర్ చెన్నయ్య, డిటిఎఫ్ నాయకులు వామన్ కుమార్, పాలమూరు అధ్యయన వేదిక కార్యదర్శి, రాఘవాచారి, కళాకారులు జక్కగోపాల్, పద్మావతి, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ మహబూబ్నగర్ కార్యదర్శి ఇందిరా, హన్వాడ రవికుమార్, ఎం ఈ ఎఫ్ గాలి యాదయ్య అరుంధతి బంధు సేవా సమితి అధ్యక్షులు హనుమంతు, సుధాకర్, సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ సింగిరెడ్డి పరమేశ్వర్ గారు, బుద్ధ సమాజ్ అధ్యక్షులు మల్లెపూవు ప్రవీణ్,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రామదాసు,అభ్యుదయ కవి జనజాల, సభ్యులు అమరచింత, ఆత్మకూర్, మక్తల్, వనపర్తి సభ్యులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ స్కూల్ విద్యార్థికి కరాటేలో బంగారు పతకం

**నవాబుపేట్ సూర్య న్యూస్ :** నవాబుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్‌లో 5వ,తరగతి చదువుతున్న విద్యార్థిని సాయి వర్షినికి కరాటేలో బంగారు పతకం సాధించినట్టు ఆ స్కూల్ డైరెక్టర్,ప్రిన్సిపాల్ రూపవతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆదివారం హైదరాబాదులోని ఇండోర్ స్టేడియంలో అండర్-12విభాగంలో"జీకే మాస్టర్ సోటో ఖాన్ కరాటే డు ఇండియా"అనే పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో సాయివర్షిని బంగారు పతకం సాధించిందని.కరాటే మాస్టర్ మహమ్మద్ సాయి వర్షినికి బంగారు పథకాన్ని అందించడం జరిగిందని.తమ స్కూల్ పిల్లలు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో,ఇతర రంగాల్లో రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా సాయి వర్షినికి స్కూల్ డైరెక్టర్,ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు,పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



## నేడు 'ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం' ఏర్పాటు

### హాజరు కానున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**పాలమూరు సూర్య న్యూస్:** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న 'ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సోసైటీ' ని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు సోసైటీ అధ్యక్ష,కార్యదర్శులు రాజసింహుడు, అంజన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పారిశ్రామికవాడ లోని ఫోరం కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం గౌరవాధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, ఫోరం రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, సయ్యద్ ఫరీద్, ప్రభాకర్ తదితరులు పాల్గొంటారని, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అవధూత స్వామి మఠంలో బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సద్గురు అవధూత నరసింహ స్వామి మఠం వారి 134వ సజీవ సమాధి ఆరాధన ఉత్సవాలు పురస్కరించుకొని స్వామివారిని బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.మఠం కమిటీ అధ్యక్షులు సభ్యులు చింతా జయప్రకాష్ తిప్పన్నా కళ్యాణి అంబర్ కళ్యాణి బాలచంద్ర నాల్వార్ రామకృష్ణ కళ్యాణి యశ్వంతులానిగే కిరణ్ డగే కిరణ్ లాండ్గే అమిత్ కళ్యాణి వివేక కల్యాణి అర్చకులు రామకృష్ణ మేకల బిజెపి నాయకులు జిల్లా లీగల్ సేల్ కన్వీనర్ నందు నామాజీ శ్రీనివాస్ రెడ్డి ప్రభంజన్ సూర్య కాంత్ నామాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**లింగాల, సూర్య న్యూస్:** ఆకస్మికంగా మృతి చెందిన బాల్యమిత్రుని కుటుంబం పేదరికంతో మగ్గుతుండడాన్ని చూసి చలించిపోయిన స్నేహితులు ఆ కుటుంబాన్ని ఆదుకుంటూ ఆర్థిక సహాయం అందించి అందరికి ఆదర్శంగా నిలిచిన సంఘటన అప్పాయి పల్లి ఆదివారం జరిగింది. మండల పరిధిలోని అప్పాయి పల్లి గ్రామానికి చెందిన యండి సబ్దం (28) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటికి పెద్ద దిక్కై కుటుంబాన్ని పోషిస్తున్న సబ్దం(28) చనిపోవడంతో ఆ కుటుంబ ఆర్థిక%అ%ఇబ్బందులను దూరం చేసి ఆదుకోవాలని బాల్యమిత్రులు పూనుకున్నారు.లింగాల హైస్కూల్లో 2011-12 విద్యా సంవత్సరం 10వ తరగతి మిత్రులు 10 వేల రూపాయలు సేకరించి తన ఇద్దరు పిల్లల అకౌంట్లో జమ చేసే విధంగా చెక్ ను మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. పేదరికంతో మగ్గుతున్న స్నేహితుని కుటుంబానికి ఆదుకుంటూ ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచిన బాల్య మిత్రులు అందరికీ ప్రేరణగా నిలిచారని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు శ్రవణ్ కుమార్, శివప్రసాద్, తరుణ్, సురేష్, శివ, సలేశ్వరం, పద్మప్, మాణిక్యం, ఐశ్వర్య, రేణుక, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ ప్రచారంలో బీసీ సంఘం నాయకులు..



**కోస్గి సూర్య న్యూస్:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారంలో కొడంగల్ బీసీ సంఘం అధ్యక్షుడు మన్నే బస్వరాజ్ యాదవ్ పాల్గొన్నారు.ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలసి జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో బీసీ కులస్తులకు,యాదవ సంఘం నాయకులను కలసి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనిల్ నాయక్, వేణుగోపాల్, రఘు రాములు,మన్నె నరేష్, వెంకట్ రాములు, వెంకటయ్య, బాలరాజ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# టిఆర్టిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక









**పాలమూరు సూర్య న్యూస్:** టి ఆర్ టి ఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ) జిల్లా కమిటీని ఆదివారం మహబూబ్ నగర్ లో ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు కావలి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల అధికారిగా స్వామి, పరిశీలకులుగా రవీందర్ రెడ్డి వ్యవహరించారు. టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా రమాకాంత్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డా. మొక్తాల మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన రామాకాంత్ మాట్లాడుతూ పిఆర్సి, పెండింగ్ డీఏలు, మెడికల్ బిల్స్, ఏరియర్స్ బిల్స్ సంబంధించి అన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి డా. మొక్తాల మురళీ మాట్లాడుతూ ఉపాధ్యాయ హెల్త్ కార్డ్స్ త్వరగా ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్ మినహాయింపు విషయంలో చొరవ తీసుకోని 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయించేలా కృషి చేయాలని కోరారు. 190 జీవోకు సంబంధించి శాశ్వత ప్రతిపాదికన స్థానికత ఆధారంగా అందరినీ అడ్జస్ట్ చేయాలని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా మాట నిలుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాములు, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా మాతా మాణికేశ్వరి సప్తమ వార్షికోత్సవ వేడుకలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** నారాయణపేట జిల్లా కేంద్ర సమీపంలోని పగడి మారి రోడ్డు లో గల శ్రీ శ్రీ శ్రీ సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరి వీరధర్మజ మాతా మాణికేశ్వరిసప్తమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు ధ్వజారోహణము, 7 గంటలకు గోమాత పూజ, 8 గంటలకు నాగ సింహాసన అభిషేకము,9 గంటలకు అమ్మవారి పాదుకల అభిషేక పూజలు,మహా గాయత్రి యజ్ఞము, 12 గంటలకు మంగళహారతి, మహిళలచే ఓంకారం త్రిశూలాకార కార్తీక దీపాలంకరణోత్సవము, ఒంటిగంటకు తీర్థ ప్రసాద అన్న దాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మాధవరెడ్డి లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,నారాయణపేట మాత మాణికేశ్వరి ఆశ్రమ కమిటీ సభ్యులు ఏవి మందార,ఏవి లత, బండి శివరాం రెడ్డి, బండి రాజేశ్వరి, వాల్వేకర్ నికేతన్, దశరథ్, విటల్ బిలాల్, తమ్మలి సత్యనారాయణ,కొండల శ్రీనివాస్,భూపాల్ రెడ్డి, సుజాత, వాసవి లతో పాటు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాలయం గుడి పునర్నిర్మాణము



**గద్వాల ప్రతినిధి సూర్యా న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నందు గద్వాల పట్టణంలో నల్లకుంట శివాలయం గుడి పునర్నిర్మాణము రాతి కటకంతో కొనసాగుతున్నది ఇట్టి నిర్మాణం కొరకు విరాల సేకరణలో భాగంగా విరాలు రాసిన దాత లింగం బాయ్ కాలనీ గద్వాల పారిశ్రామికవేత్త మేక సోంపల్లి ప్రభాకర్ రెడ్డి గుడి నిర్మాణము కొరకు విరాళాలు 351116( మూడు లక్షల యాభై ఒక్క వెయ్యి నూట పద ఆరు) రూపాయలు ప్రభాకర్ రెడ్డి దంపతులు సహృదయంతో మనస్ఫూర్తిగా చందా రాయడం జరిగినది. చందా రాసిన మేక సోంపల్లి ప్రభాకర్ రెడ్డి దంపతులకు వారి కుటుంబ సభ్యులకు ఆ శివుని కృప ఎల్లవేళలా ఉండాలని ఆ భగవంతుని కోరుతూ ప్రభాకర్ రెడ్డి దంపతులకు కుటుంబానికి నల్లకుంట శివాలయం కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ యొక్క విరాళాలు సేకరణలో పాల్గొన్న నల్లకుంట శివాలయ కమిటీ సభ్యులు. శివాలయ కమిటీ చైర్మన్ పులిపాటి వెంకటేష్. ఉపాధ్యక్షులు వెంకట్ రాములు గుమ్ముడం గోపాల్ నల్లారెడ్డి. పరమాల రామ్ రెడ్డి. కార్యదర్శి. సోనీ వెంకటేష్ బాలాజీ అల్లంపల్లి వెంకటేష్ రాజు వాల్మీకి కురువ భాస్కర్ ఈ యొక్క విరాళ సేకరణలో పాల్గొనడం జరిగినది.

# వికారాబాద్‌లో పట్టుబడ్డ 25 కేజీల గంజాయి



**వికారాబాద్, మేజర్ న్యూస్ (నవంబర్ 09)**: వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో 26 కేజీల ఎండు గంజాయి పట్టుబడ్డట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో గంజాయి రవాణా జరుగుతుందని, విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్నారనే విశ్వసనీయమైన సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం రైల్వే హాస్పిటల్ పరిసర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. అయితే రైల్వే ఆసుపత్రి దగ్గర అనుమానంగా(3) బ్యాగుల కనిపించడంతో వాటి గురుంచి చుట్టు పక్కల విచారించగా ఎవరు కూడ తమదని ముందుకు రాలేదని తెలిపారు. బ్యాగులను తెరిచి చూడగా బ్రౌన్ కలర్ టేప్‌తో చుట్టబడిన పాకెట్స్‌లో ఎండు గంజాయి ఉందని తెలిపారు. వాటిని లెక్కించగా మొత్తం 13 పాకెట్లలో 26 కేజీల ఎండు గంజాయి పట్టుబడిందని తెలిపారు. దానిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సీఐ కే శ్రీనివాస్ తెలిపినారు ఇట్టి దాడుల్లో ఎస్సై ప్రేమ్ కుమార్ రెడ్డి, మరియు వారి యొక్క సిబ్బంది పి.విష్ణువర్ధన్ రెడ్డి, పి.రవికిరణ్, కె.శివప్రసాద్,సి.కుమార్ లు పాల్గొన్నారు.



# తెగ తాగుడే...!

- వీకెండ్‌లో అత్యధికంగా నమోదువుతన్న డ్రంకన్ డ్రైవ్ కేసులు
- రెండు రోజుల్లో 529, అత్యధికంగా 71 రాజేంద్రనగర్‌లోనే
- పట్టుబడుతున్న వారిలో21-30 వయస్సువారే అధికం
- ద్విచక్ర వాహనాలు 417, త్రీ విల్లర్ 24, ఫోర్ విల్లర్ 88 కేసులు నమోదు



చేవెళ్లలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (నవంబర్ 09) :** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొరడాఝులిపిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసింది. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మద్యం తాగి నడుపుతున్నవారి వల్లే జరుగుతు న్నాయిని పోలీసులు చెబుతున్నారు. డ్రంకెన్ డ్రైవర్ వీకెండ్స్, శని, ఆదివారాల్లో పట్టుబడుతున్న కేసులే ఎక్కువగా ఉన్నాయి. తాగి వాహనాలు నడుపొద్దని హెచ్చరిస్తున్నా.. మందు బాబుల తీరు మారడం లేదు. మద్యం తాగి వాహనాలను నడపడం పరిపాటిగా మారిపోతుంది. ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా, వాహనాలను సీజ్ చేస్తున్నా గానీ పట్టుబడుతున్నారు. వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. దీంతో డ్రంకన్ డ్రైవ్‌పై పోలీసులు మరింత పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని డ్రైవర్ మద్యం సేవించాడా లేదా అనే విషయాన్ని ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా చెక్ చేస్తున్నారు. మద్యం సేవించినట్లు రుజువైతే వెంటనే కేసు నమోదు చేస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 529 మంది పట్టుబడ్డారు. అత్యధికంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లోనే 71 కేసులు నమోదయ్యాయి. పట్టుబడిన వారిలో 21 నుంచి 30 ఏళ్ల వయస్సు వాళ్లే 213 మంది ఉన్నారు. అందులో టు వీల్లర్ కేసులే అత్యదికంగా 417 ఉన్నాయి. అలాగే త్రీవిల్లర్ 24, ఫోర్ విల్లర్ 88 ఉన్నాయి.

| పీఎస్ | కేసులు |
|---|---|
| మాధాపూర్ | 27 |
| రాజేంద్రనగర్ | **71** |
| శంషాబాద్ | 40 |
| గచ్చిబౌలి | **42** |
| షాద్‌నగర్ | 42 |
| చేవెళ్ల | **17** |
| నార్సింగి | 15 |
| రాయదుర్గం | **33** |
| మియాపూర్ | 27 |
| కూకట్‌పల్లి | **13** |
| బాలానగర్ | 33 |
| జీడిమెట్ల | **23** |
| అల్వాల్ | 39 |
| కేపీహెచ్‌బి | **54** |
| మేడ్చల్ | 36 |
| ఆర్సీపురం | **17** |
| మొత్తం | *529* |



చేవెళ్లలో ద్విచక్ర వాహనదారుడిని బీత్‌ఎనలైజర్ ద్వారా చెక్ చేస్తున్న పోలీసలు

షాద్ నగర్‌లో చెక్ చేస్తున్న పోలీసులు





చేవెళ్లలో బీజాపూర్ హైవేల్లో బ్రీత్ ఎనలైజర్‌లో ఊదుతున్న లారీ డైవర్

# ఆర్టీసీ బస్సు ప్రమాదం

- అనాథలైన పిల్లలను ఆదుకుంటా
- తల్లిదండ్రులు కోల్పోయిన హాజీపూర్ అమ్మాయిని నర్సింగ్ చదిస్తాం
- ఒక్కొరికి రూ. 30వేల ఆర్థిక సాయం అందజేత
- చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా



యాలాల మేజర్ న్యూస్:(నవంబర్9) చేవేళ్ల మండలం మీర్జాగూడ వద్ద కంకర టిప్పర్ లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ కు చెందిన అఖిల రెడ్డి,హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యా భర్తలు లక్ష్మీ, బందెప్ప, పేర్కంపల్లికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు తమాషా, సాయిప్రియ,నందిని మృతి చెందిన సంగతి తెలిసిందే.ఆదివారం చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి యాలాల మండలం మృతుల కుటుంబాలను పరామర్శించారు.తన సొంత ఖర్చుల నుంచి ఒక్కొక్కరికి రూ. 30వేల చొప్పున ఆర్థిక చేయూతను అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వమే రోడ్ల నిర్మాణం చేస్తుందని అన్నారు.త్వరలో రూ.60 కోట్ల నిధులను రోడ్ల నిర్మాణంకు మంజూరు చేయబోతుందని తెలిపారు.అనంతరం కేంద్రం నుంచి రూ. 2లక్షల పరిహారం వారంలో మృతుల కుటుంబాలకు ఇప్పించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.బాధిత కుటుంబాలకు కూడా న్యాయం జరిగేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా,బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యు రమేష్ కుమార్ మాజీ ఎమ్మెల్యే రత్నం బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మందు బాబులకు అడ్డాగా కళాశాల ప్రాంగణం




**దోమ మేజర్‌న్యూస్ (నవంబర్ 09)**: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలు మందుబాబుల కు అడ్డలుగా మారాయి. దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ఉన్న ప్రాంగణంలో మందుబాబులు ఆల్కహాలు సేవించి సీసాలను అక్కడే వదిలేశారు. చదువుకునే కళాశాల చుట్టూ ప్రక్కల ఉన్న ఖాళీ స్థలాలను కూడా మందు బాబులు మందు సేవించడానికి వినియోగించుకుంటున్నారు. ఒకపక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గవర్నమెంట్ కు సంబంధించి పరిసర ప్రాంతాల్లో మందు సేవించరాదని చెబుతున్న అవి ఏమాత్రం లెక్కచేయకుండా మందుబాబులు రాత్రి సమయాల్లో ఇలాంటి స్థలాలను ఎంచుకుంటున్నారు. దీనితో స్థానికులు కాలేజీలో స్థలాలను మాత్రం లెక్కచేయకుండా రాత్రి సమయా ల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పలువురు మండిపడుతున్నారు. కావున పోలీసులు ఇలాంటి వాటిపైన దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.





## ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం..!

### స్టీరింగ్ రాడ్డు విరిగి మోరాయింపు

**యాలాల మేజర్ న్యూస్:(నవంబర్ 09)** మండలం పరిధిలోని లక్ష్మినారాయణ పూర్ చౌరస్తాలో తాండూరు ఆర్టీసీ డిపో నుండి మహబూబ్ నగర్ ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది.బస్సుకు స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో మోరాయించింది.ఈ సంఘటన ఆదివారం జరిగింది.తాండూరు ఆర్టీసీ డీపోకు చెందిన ప్రైవేట్ బస్సు(టీఎస్ 34 టీఏ 5454) తాండూరు నుంచి మహబూబ్ నగర్ సర్వీసు అందిస్తోంది.ప్రతి రోజు మాదిరిగానే ఈ బస్సు ఆదివారం ఉదయం ప్రయాణికులతో బయల్దేరింది.గుంతల రోడ్డు కూడా ఉంది.స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో ఎలాంటి నష్టం జరగకపోవడంతో బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ముందుకు సాగక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

## మార్కెట్ కు భారీగా మొక్కజొన్న



**నవాబుపేట్ సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు భారీగా మొక్కజొన్న రావడం జరిగింది.ఆదివారం ఒక్కరోజే రైతులు10,351మొక్కజొన్న బస్తాలను తీసుకురావడం జరిగింది.మొక్కజొన్న ధాన్యం క్వింటాకు గరిష్టంగా రూ.2,116ధర లభించినట్లు,క్వింటాకు కనిష్టంగా రూ.1,503ధర, మధ్య రకానికి రూ.1,875పలికినట్లు, వరి(హంస) 278 బస్తాల ధాన్యం వచ్చినట్లు, క్వింటాకు గరిష్టంగా రూ.2,811లభించగా, క్వింటాకు రూ.1,812ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు.

## 13 న క్రికెట్ సెలక్షన్స్

**మహబూబ్ నగర్ క్రీడలు సూర్య న్యూస్ :** మహబూబ్నగర్ జిల్లా14 వ ఎస్ జి ఎఫ్ క్రికెట్ సెలక్షన్స్ బాలురకు 13 న క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్ ఆధార్ కార్డు జిరాక్స్ తో ఎం డి సి ఎ గ్రౌండ్ సత్యం కాలనీ పిల్లలమర్రి రోడ్ మహబూబ్నగర్ లో అబ్దుల్లా సార్ పిడికి రిపోర్ట్ చేయాలని జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ డా ఆర్ శారదా భాయి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9000574651 సంప్రదించాలన్నారు. క్రీడాకారులు వైట్ డ్రెస్ కోడ్ లో పూర్తి కిట్టుతో రిపోర్ట్ చేయాలన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**గండీడ్ మేజర్ న్యూస్:** గండీడ్,బల్సూర్ గొండ,ఆశి రెడ్డిపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, పగిడ్యాల, కొండాపూర్, సల్కార్ పేట్,రుసుంపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని, ప్రభుత్వ ఏర్పాటు కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని అన్నారు. ప్రభుత్వం క్వింటాల్ కు 2389 రూపాయల మద్దతు ధరతో పాటు సన్న రకం వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి,గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆశన్న, ఏపీఎం రజిత, సీఈవో శీలం ఆశన్న,ఏఈఓ వరలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్లో పాలమూరు సత్తా




**మహబూబ్ నగర్ క్రీడలు సూర్య న్యూస్ :** జగిత్యాలలో సీనియర్ వుమెన్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 7 నుండి 9 వరకు నిర్వహించిన పోటీలోపాలమూరు రెండవ స్థానంలో నిలిచిందని జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రటరీ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.తెలంగాణ సాఫ్ట్ బాల్ సెక్రటరీ శోభన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.21 జిల్లాలు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిల్వగా ,రెండవ స్థానంలో మహబూబ్ నగర్ ,మూడవ స్థానం లో సిద్దిపేట జట్లు నిలిచాయి.

# అయిజలో తైక్వాండో విద్యార్థులకు బెల్టు ప్రమోషన్: 300 మంది ప్రతిభావంతులకు బెల్టుల ప్రదానం!



**ఐజ సూర్య న్యూస్ :** అయిజ మున్సిపాలిటీ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నందు నందు ఆదివారం ఉదయం తైక్వాండో విద్యార్థిని విద్యార్థులకు బెల్టు ప్రమోషన్ ఎగ్జామినేషన్ అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణంలోని మూడు తైక్వాండో అకాడమీల నుండి దాదాపు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కఠోర సాధన, పట్టుదలతో కూడిన వారి ప్రదర్శనతో వారు తమ తదుపరి స్థాయి బెల్టులను పొందడానికి అర్హత సాధించారు. ఈ ముఖ్య కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మాస్టర్ కే. శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు జోగులాంబ గద్వాల్ జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ మాస్టర్ షేక్షావలి ఆచారి మరియు అయిజ సీనియర్ తైక్వాండో మాస్టర్, అడ్వకేట్ మధు మాస్టర్ ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మాస్టర్ కే. శ్రీహరి విద్యార్థులకు తమ చేతుల మీదుగా బెల్టులు ప్రదానం చేస్తూ, వారి కృషిని, క్రమశిక్షణను ఎంతగానో మెచ్చుకున్నారు. మీరు తైక్వాండోలో చూపిన అంకితభావం అద్భుతం. ఈ మార్షల్ ఆర్ట్స్ కేవలం శారీరక బలాన్ని మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం మరియు క్రమశిక్షణను కూడా పెంచుతుంది. ఈ రోజు మీరు పొందిన ఈ బెల్టులు మీ నిబద్ధతకు నిదర్శనం, అని ఆయన విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. జిల్లా ప్రెసిడెంట్ మాస్టర్ షేక్షావలి ఆచారి మాట్లాడుతూ, విద్యార్థులు ఇంత ఉత్సాహంగా బెల్టు ప్రమోషన్ పొందడం



తమ జిల్లాకు గర్వకారణమని తెలియజేశారు. సీనియర్ మాస్టర్ మధు మాస్టర్, మాస్టర్స్ కే. సుధీర్ కుమార్, ప్రదీప్ సాగర్ మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. బెల్టులు పొందిన విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన అత్యుత్తమ నైపుణ్యాలు వారి గురువుల శిక్షణకు, వారి నిరంతర సాధనకు అద్దం పడుతున్నాయి. తైక్వాండో మార్గంలో ఈ కొత్త మెట్టు ఎక్కిన ఈ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారు తమ క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆశిద్దాం. ఈ విజయం వారిని మరింతగా ప్రోత్సహించి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి తోడ్పడుతుంది అనడంలో సందేహం లేదు.

# స్టేట్ లెవెల్‌లో మెరిసిన పెద్దకొత్తపల్లి విద్యార్థులు.

## కరాటే మాస్టర్ రామచందర్ శిక్షణలో నేషనల్స్ వైపు దూసుకెళ్తున్న కొత్త తరం!




**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం వేదికగా నవంబర్ 7న జరిగిన ఎస్ క్యూ ఏ వై మార్షల్ ఆర్ట్స్ స్టేట్ లెవెల్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆ వేదికపై పెద్దకొత్తపల్లి విద్యార్థులు తమ ప్రతిభా ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించారు.ఎదురు దెబ్బలతో, జాగ్రత్త కదలికలతో, చాకచక్యంగా ఎదుర్కొన్న ఈ చిన్న యోధులు ఒక్కొక్కరుగా తమ ప్రావీణ్యాన్ని చూపించారు. ప్రేక్షకుల చప్పట్ల మధ్య విజేతలుగా నిలిచి నేషనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.తమ కఠోర సాధన, అంకితభావం, క్రీడపై మమకారమే ఈ విజయానికి కారణమని కోచ్‌లు తెలిపారు.పట్టుదలతో సాధన చేస్తే గ్రామీణ ప్రాంతాల పిల్లలు కూడా అంతర్జాతీయ స్థాయికి ఎదగగలరని ఈ పిల్లలు నిరూపించారు, అని కోచ్ ఆనందంగా చెప్పారు.ఇకపై జనవరి 5 నుండి 7 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న నేషనల్ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. అక్కడ మెడల్స్ సాధించిన వారు ఇంటర్నేషనల్ స్థాయి పోటీలకు అర్హత పొందనున్నారు.వీరి విజయంపై తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం గర్వం వ్యక్తం చేస్తూ, మన ప్రాంతం నుంచే రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరిసిన పిల్లలు రావడం ఆనందకరం. నేషనల్స్‌లో కూడా బంగారు పతకాలు సాధించి తెలంగాణ పేరును వెలుగొందించాలని ఆశిస్తున్నాం అన్నారు.పెద్దకొత్తపల్లి విద్యార్థుల ఈ విజయగాథ ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. పిల్లల విజయంపై గర్వపడుతున్న తల్లిదండ్రులు, గురువులు తదుపరి విజయాలకూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలి.



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని కర్నూల్ జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో కబడ్డీ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగినది, ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాల్లో 2శాతం కల్పిస్తుందని క్రీడాకారులు క్రిడల్లో రాణించి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి కోరారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ క్రీడలు డిసెంబర్ 5 నుండి 8వ తేదీ వరకు మహబూబ్ నగర్ లో నిర్వహించడం జరుగుతుందని, సీనియర్ కబడ్డీ క్రీడలు కరీంనగర్ లో జరుగుతాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మాజీ వార్డు సభ్యులు దున్న భాస్కర్, సీనియర్ క్రీడాకారుడు జంగయ్య గౌడ్, శ్రీనివాసులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు మోహన్ లాల్, డాక్య, రామన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

**విలేకరులు కావలెను**

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్యలో
పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, మిడ్జిల్, రాజాపూర్, మూసాపేట, దేవరకద్ర రూరల్
వనపర్తి జిల్లా : వనపర్తి రూరల్, పెద్దమందడి, కొత్తకోట, పాన్‌గల్, ఖిల్లఘణపురం,
నాగర్‌కర్నూల్ జిల్లా : అమ్రాబాద్, పదర, బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట,
జోగులాంబగద్వాల జిల్లా : ఇటిక్యాల, ఎర్రవల్లి, వడ్డేపల్లి, గట్టు, మానోపాడు

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757